నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 27 జనవరి 2024 | NIZAMABAD

**ఉమ్మడి జిల్లాలో** గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, జితేశ్ వీ పాటిల్ పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. నిజామాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- ఉమ్మడి జిల్లాలో ఘనంగా రిపబ్లిక్‌డే వేడుకలు
- వాడవాడలా రెపరెపలాడిన జాతీయ జెండా
- జిల్లాకేంద్రాల్లో పతాకావిష్కరణ చేసిన కలెక్టర్లు
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉత్తమ ఉద్యోగులకు పురస్కారాలు


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## రాజ్యాంగబద్ధంగా పనిచేయాలి

**బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి**


బాల్కొండలో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ, జనవరి 26 : ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి లోబడి పనిచేయాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా బడుగు బలహీన వర్గాలు, అట్టడుగు ప్రజలకు కులమతాలకతీతంగా అందరికీ కూడా సమాన హక్కులు కల్పించినట్లు తెలిపారు. రాజ్యాంగ చట్రంలోకి కొన్ని రాజ్యాంగేతర శక్తులు దూరి ఆ స్ఫూర్తిని చెడగొడుతున్నాయని, ఇకనైనా వారి తీరు మార్చుకోవాలని సూచించారు.

## అర్హులందరికీ అభివృద్ధి ఫలాలు

**నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**


నిజామాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఖలీల్‌వాడి/నిజామాబాద్ స్పోర్ట్స్, జనవరి 26: ప్రాథమిక హక్కులతో తారతమ్య భేదాలు లేకుండా జీవనం సాగించాలని, అభివృద్ధి ఫలాలందరికీ అందాలని బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడేలా ప్రజలకు పారదర్శకమైన పాలన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో రోజుకు 75 వేల మంది మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నదని పేర్కొన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌తోపాటు రైతు భరోసా పథకం ద్వారా 1,76,113 మంది చిన్నకారు రైతుల ఖాతాల్లో రూ. 89.86 కోట్ల జమచేసినట్లు చెప్పారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు 100 శాతం ఉత్తీర్ణత కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తునట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, మేయర్ దండు నీతూ కిరణ్, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు చిత్రా మిశ్రా, పి.యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్



ఎం.మకరంద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. రిపబ్లిక్ డే వేడుక సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరింపజేశాయి.

# జనగణమన..


నిజామాబాద్‌లో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ




పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు


బాన్సువాడలో దివ్యాంగుడికి ఎలక్ట్రికల్ వీల్ చైర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి








నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని పరేడ్ మైదానంలో వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు


కామారెడ్డిలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

## అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

**కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**



కామారెడ్డి, జనవరి 26 : జిల్లా అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే తపనతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. ఇందులో భాగంగా 6 గ్యారెంటీల అమలుకు హామీ ఇచ్చి, రెండు గ్యారంటీలను నెరవేర్చిందని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో 27 లక్షల 75 వేల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం కింద ఆరు గ్యారెంటీల కోసం 2,94,799 దరఖాస్తులతో పాటు ఇతర సమస్యలపై 13,367 దరఖాస్తులు స్వీకరించి కంప్యూటరీకరణ చేశామని వివరించారు. రైతన్నలకు వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌తోపాటు పంట పెట్టుబడి సాయం అందిస్తున్నదని తెలిపారు. పంట రుణాల మాఫీకి ప్రభుత్వం బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నదని అన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ఎంపీ బీబీ పాటిల్,జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధూశర్మ ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మనూచౌదరి, చంద్రమోహన్, ట్రైనీ ఎస్పీ కాజల్ సింగ్, ఆర్డీవోలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


కామారెడ్డిలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్


నిజామాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, నగర్ మేయర్ నీతూకిరణ్

## కళ తప్పిన క్యాంప్ ఆఫీసులు


మూసి ఉన్న రూరల్, బోధన్ ఎమ్మెల్యేల క్యాంప్ ఆఫీసులు



*జిల్లాలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడగా.. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, బోధన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు బోసిపోయాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని హంగులతో ఈ కార్యాలయ భవనాలను నిర్మించగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిననాటి నుంచి ఇప్పటివరకు తెరుచుకోకపోవడం గమనార్హం. ఏదైనా పనివిషయమై వచ్చే ప్రజలకు అక్కడ గేట్లకు వేసిన తాళాలే దర్శనమిస్తున్నాయి. నిజామాబాద్ రూరల్, బోధన్ ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి కనీసం అటువైపు కన్నెత్తికూడా చూడడంలేదు. రిపబ్లిక్ డే రోజున కూడా జాతీయ జెండాను ఆవిష్కరించకపోవడంతో కార్యాలయాలు కళావిహీనంగా కనిపించాయి.*

*–ఖలీల్‌వాడి/బోధన్, జనవరి 26*


బాన్సువాడలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదాం..

- గెలిపించే బాధ్యత నాది..
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, జనవరి 26: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదామని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడ మున్సిపల్‌తోపాటు అన్ని గ్రామాల్లో ఎన్నికల్లో నిలబడిన ప్రతిఒక్కరినీ కూర్చుండబెట్టి గెలిపిస్తానని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాను చేసిన పనులను సమయం లేక చెప్పుకోలేకపోయానని, ఇప్పుడు ప్రతి గల్లీ, ఇంటికి వెళ్లి చెబుతానని పేర్కొన్నారు.ప్రజలను మెప్పించి గెలిపిస్తానని నాయకులకు భరోసానిచ్చారు. బాన్సువాడలో క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. బాన్సువాడ మున్సిపాలిటీని ఒంటిచేత్తో గెలిపిస్తానని, అదే విధంగా సర్పంచులను కూడా భారీ మెజార్టీతో గెలిపించి తీరుతానని ధీమా వ్యక్తంచేశారు.

### పేదలకు అన్యాయం చేసిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉండగా..బాన్సువాడ నియోజకవర్గానికి 24 వేల ఇండ్లు మంజూరైనట్లు అధికారికంగా లెక్కలు ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గంలో 24 వేల ఇండ్లు నిర్మిస్తే ..ఇప్పుడు ఇల్లు ఎవరికీ అవసరం ఉండదన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ బడానాయకులే ఇండ్లను రాసుకొని పేదలకు అన్యాయం చేశారని ఆరోపించారు. అలాంటి బడానాయకుల మాటలు విని ఇండ్లు కట్టకున్నా బిల్లులు మంజూరుచేసిన సుమారు 250 మంది ప్రభుత్వ ఉద్యోగులను బర్తరఫ్ చేశారని తెలిపారు. 24వేల ఇండ్లు నిర్మిస్తే నియోజకవర్గంలో ఇండ్లు లేని వారు ఉండేవారా అని ప్రశ్నించారు. నాడు దొంగలు దొంగలు కలిసి ఇండ్లు పంచుకున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం వచ్చిందంటూ ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సుమారు 14 చోట్ల వెయ్యి, పదిహేను వందల ఓట్లతో ఓటమి చెందారని, అవన్నీ కలిపితే తమకు 54 సీట్లు వచ్చేవని, తామే అధికారంలో ఉండేవారమని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకంలో రూ.5లక్షల్లో రూ.లక్ష తీసుకుంటున్నారంటూ బద్నాం చేస్తున్నారని, ఇది ఎంత వరకు సమంజసమని అన్నారు. ఇండ్ల నిర్మాణంలో బిల్లుల వివరాలను గతంలోనే వివరించినా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.